AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN
24-2-2026 (Tuesday) MAIN EDITION

## కూలిన ఎయిర్ అంబులెన్స్.. ఏడుగురు మృతి



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఝార్ఖండ్‌లో ఎయిర్ అంబులెన్స్ కూలిపోయింది. ఈ ఘటనలో పైలట్లు, రోగి సహా ఏడుగురు మృతి చెందారు. రాంచీ నుంచి ఢిల్లీ వెళ్తుండగా చత్రా జిల్లాలో ప్రమాదం జరిగింది. జార్ఖండ్‌లోని చత్ర జిల్లాలో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎయిర్ అంబులెన్స్ కూలిపోయింది. అందులో ఉన్న ఏడుగురు మృతి చెందారు. సోమవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ప్రతికూల వాతావరణం కారణంగా ప్రత్యామ్నాయ మార్గాన్ని కోరుతూ కమ్యూనికేషన్ మరియు రాడార్ సంబంధాన్ని కోల్పోయిందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తెలిపింది. విమానం రాంచీ నుంచి బయలుదేరింది.

## తిరుమల లడ్డూ కల్తీపై అసెంబ్లీలో చర్చ..



**అక్షరటుడే, ఏపీ:** తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడటంపై ఏపీ అసెంబ్లీలో మంగళవారం చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలనలో కూడా తిరుమల వేంకటేశ్వర స్వామి జోలికి రాలేదన్నారు. ఇందులో కుట్ర కోణం ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో సిండికేట్గా తయారయ్యారని చెప్పారు. 59 లక్షల కేజీల నెయ్యి కల్తీ జరిగిందన్నారు. ఎన్‌డీడీబీ రిపోర్టు రాగానే తాను ప్రకటన చేశానని గుర్తు చేశారు. 2019-24 మధ్య దేవాలయాల్లో అరాచకాలు జరిగాయన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు గుడ్‌న్యూస్




**అక్షరటుడే, ఏపీ:** ఆర్టీసీ కార్మికులకు ఈహెచ్‌ఎస్ కింద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో చికిత్సకు అందిస్తున్న రూ. 2 లక్షలకు అదనంగా మరో రూ. 2లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అసెంబ్లీలో వెల్లడించారు. ఈహెచ్‌ఎస్ కింద ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకూ వైద్యం అందిస్తున్నామన్నారు.

## ఉద్యోగులకు సీఎంవో సందేశాలు పంపొద్దు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేరళ ప్రభుత్వానికి ఆ రాష్ట్ర హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత డేటాను సీఎంవో అనధికారికంగా యాక్సెస్ చేస్తోందని పేర్కొంది. ప్రమోషనల్ మెసేజ్‌ల కోసం దానిని వినియోగిస్తోందన్న ఆరోపణలపై వెంటనే వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్‌పై బేర్ పట్టు బిగించడంతో ప్రధాన సూచీలన్నీ నష్టాల బాటలో పయనిస్తున్నాయి. ఓవైపు మధ్యప్రాచ్యంలో యుద్ధభయాలతో పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలు.. మరోవైపు దూసుకొస్తున్న ఏఐ.. ఇంకోవైపు ట్రంప్ టారిఫ్‌ల గోల.. వెరసి ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.



## ఖమ్మం జిల్లాలో ఉద్రిక్తత.. పేదల ఇళ్ల కూల్చివేత..

**అక్షరటుడే, ఖమ్మం:** ఖమ్మం జిల్లాలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రభుత్వ భూమిలో నిర్మించుకున్న ఇళ్లను అధికారులు కూల్చి వేస్తున్నారు. స్థానికులు అడ్డుకోవడంతో భారీగా పోలీసులు మోహరించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వి వెంకటాయపాలెం సమీపంలోని 60 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో కొంతకాలంగా పలువురు నివాసం ఉంటున్నారు. దాదాపు 600 మంది ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు గుడిసెలు వేసుకొని జీవిస్తుండగా.. మరి కొందరు శాశ్వత నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ భూమిపై కొంతకాలంగా కోర్టులో వివాదం నడుస్తోంది. ఇటీవల కోర్టు సదరు భూమిని స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో మంగళవారం ఉదయం అధికారులు రంగంలోకి దిగారు.



## అమెరికాలో తీవ్ర హిమపాతం..

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికాలో మంచు తుపాను తీవ్ర రూపం దాల్చింది. ఈశాన్య ప్రాంతాల్లో భారీగా మంచు కురుస్తోంది. దీంతో లక్షల మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మంచు తుపాను, బలమైన ఈదురు గాలుల కారణంగా రవాణా వ్యవస్థలు స్తంభించాయి. వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. శనివారం నుంచి మంగళవారం మధ్య 10,000 కంటే ఎక్కువ విమాన సర్వీసులు రద్దయినట్లు విమానాల ట్రాకింగ్ సర్వీస్ 'ఫ్లైట్ అవేర్' పేర్కొంది.



దేశంలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. కొత్త కొత్త మార్గాల్లో కేటుగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో నిత్యం ఎంతో మంది మోసపోతున్నారు. ఈ క్రమంలో సైబర్ క్రైమ్ పోలీసులకు అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో పోలీసులు ఆక్టోపస్ పేరుతో స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న 104 మంది నిందితులను అరెస్ట్ చేశారు. 16 రాష్ట్రాల్లో ఈ ఆపరేషన్ చేపట్టారు. నిందితుల్లో బ్యాంకు ఉద్యోగులు సైతం ఉండడం గమనార్హం.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# పోలీసుల భారీ ఆపరేషన్

■ 104 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్ ■ నిందితుల్లో బ్యాంకు ఉద్యోగులు ■ రూ.36 లక్షల నగదు స్వాధీనం

దేశవ్యాప్తంగా పనిచేస్తున్న సైబర్ క్రైమ్ సిండికేట్లపై సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు నాయకత్వంలో పోలీసులు 16 రాష్ట్రాలలో సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించారు. ఇటీవల పెట్టుబడి మోసాలు, ట్రేడింగ్ మోసాలు "డిజిటల్ అరెస్ట్" స్కామ్‌లకు బాధితులు బలైపోతున్న కేసులు పెరిగాయి. ఫలితంగా వారు కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోయారు. పరిస్థితి తీవ్రతను గుర్తించి, ఈ అక్రమ నెట్‌వర్క్‌లకు నిర్ణయాత్మక దెబ్బ కొట్టడానికి ఆపరేషన్ ఆక్టోపస్‌ను రూపొందించారు. హైదరాబాద్‌లోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ బాధితుల నిధులను స్వాహా చేయడానికి ఉపయోగించే 151 బ్యాంకు ఖాతాల సంబంధాన్ని గుర్తించింది.

### 32 బృందాల ఏర్పాటు

ఖచ్చితమైన నిఘా సేకరణ, ఫోరెన్సిక్ విశ్లేషణ ద్వారా, నేరాల ఆదాయాన్ని లాండరింగ్ చేయడానికి 151 బ్యాంకు ఖాతాల సంక్లిష్ట వెబ్‌ను గుర్తించారు. ఈ నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేయడానికి 32 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 10 రోజుల వ్యవధిలో 16 రాష్ట్రాలలో ఒకేసారి ఆపరేషన్ జరిగింది. మోసం అమలులో కీలక పాత్ర పోషించిన 104 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. ఇందులో మ్యూల్ అకౌంట్లు ఇచ్చిన వారు 86 మంది ఉన్నారు. ఈ ఖాతాలను సేకరించడానికి, సూత్రధారులకు నిధుల తరలింపును సులభతరం చేయడానికి బాధ్యత వహించే 17 మంది మధ్యవర్తులను సైతం అదుపులోకి తీసుకున్నారు. మోసగాళ్లతో కుమ్మక్కు అయిన బంధన్ బ్యాంక్ మేనేజర్ అరెస్ట్ చేశారు.

### 1,055 కేసులు

ప్రస్తుతం అరెస్టు అయిన వారిపై దేశవ్యాప్తంగా 1,055 సైబర్ కేసులు నమోదు అయ్యాయి. ఇందులో మొత్తం రూ.127 కోట్ల మోసం జరిగింది. పోలీసులు నిందితుల నుంచి 204 ఫోన్లు, 141 సిమ్ కార్డులు, 152 బ్యాంక్ పాస్‌బుక్‌లు, 234 డెబిట్/క్రెడిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు, 56 కార్పొరేట్ స్టాంపులు, రూ.36 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్, డీసీపీ అరవింద్ బాబు పర్యవేక్షణలో జరిగింది.

## పేదల ఇళ్ల కూల్చివేతలను ఆపాలి : హరీశ్‌రావు




**అక్షరటుడే, హైదరాబాద్:** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల వినోబానగర్‌లో అప్పులు చేసి పేదలు నిర్మించుకున్న ఇళ్లను, వేల మంది పోలీసుల పహారాలో కూల్చివేయడం అత్యంత హేయమైన చర్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం ఉదయం నుంచి అధికారులు ఆక్రమణలను తొలగిస్తున్నారు. అయితే పలువురు బాధితులు జేసీబీలకు అడ్డం పడుకొని ఆందోళన చేశారు. బాధితులను పోలీసులు పక్కకు పంపించారు. ఈ ఘటనపై హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. నాలుగు జిల్లాల నుంచి వేల మంది పోలీసులను మోహరించి, యుద్ధ వాతావరణాన్ని సృష్టించి పేదల ఇళ్లను కూల్చాల్సిన అవసరం ఏమొచ్చిందని మాజీ మంత్రి ప్రశ్నించారు. పేద ప్రజలు తీవ్రవాదుల్లా కనిపిస్తున్నారా అన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని మీడియాను రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు.

## రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు..

**అక్షరటుడే, హైదరాబాద్:** ఇంటర్మీడియట్ పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధిత అధికారులు ఆయా కళాశాలల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో ప్రైవేట్ కాలేజీలు 863, ప్రభుత్వ కాలేజీలు 425, పాఠశాలల్లో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలకు మొత్తం 9,97,075 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు కృష్ణ ఆదిత్య తెలియజేశారు. కాగా.. రాష్ట్రవ్యాప్తంగా 1,495 మంది చీఫ్ సూపరింటెండెంట్లు విధుల్లో ఉంటారు. అలాగే డిపార్ట్‌మెంట్ అధికారులు 1,495, ఇన్విజిలేటర్లు 29,500, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 75, సిట్టింగ్స్ స్క్వాడ్ 200 ఉన్నారు. ఫస్టియర్‌లో బాలురు 2,17,428, బాలికలు 2,24,437 పరీక్షలు రాయనున్నారు. ఒకేషనల్ విద్యార్థులు బాలురు 22,586, బాలికలు 24,675 మొత్తంగా ఫస్టియర్ విద్యార్థులు 4,89,126 రాస్తున్నారు. అలాగే సెకండియర్‌లో బాలురు 2,31,471, బాలికలు 2,30,850 పరీక్షలు రాస్తున్నారు. ఒకేషనల్‌లో సెకండియర్ బాలురు 22,429, బాలికలు 23,199 మంది పరీక్షలు రాయనున్నారు.

## ఎంతకాలం ఉంటానో తెలియదు..: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎంతకాలం బతికి ఉంటానో తెలియదన్నారు. తనపై జరుగుతున్న హత్యాయత్నాలపై స్పందిస్తూ ఆయన ఈ విధంగా స్పందించారు. ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసంలోకి శనివారం ఓ దుండగుడు ప్రవేశించిన విషయం తెలిసిందే. తుపాకీ పట్టుకొని వచ్చిన అతడిని గుర్తించిన భద్రతా సిబ్బంది కాల్చి చంపారు. ఈ ఘటనపై స్పందిస్తూ.. "నేను ఎంతకాలం ఉంటానో తెలియదు" అని ట్రంప్ అన్నారు. ఎన్ని బెదిరింపులకు పాల్పడినా తాను వెనక్కి తగ్గనని స్పష్టం చేశారు.

## సినీపరిశ్రమలోకి రావడం ఒక వరం..



**అందాల తార అలియా భట్ అంతర్జాతీయ వేదికపై మెరిసింది. లండన్‌లో జరిగిన బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ (బాఫ్టా) ఎడిషన్ అవార్డుల వేడుకలో ప్రెజెంటర్‌గా వ్యవహరించింది. తొలిసారి ఈ వేడుకకు హాజరై రెడ్‌కార్పెట్‌పై హొయలొలికించిన అలియా.. వేదికపై తన ప్రసంగాన్ని 'నమస్కార్' అంటూ హిందీలో ప్రారంభించి.. అందరిదృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా అలియా మాట్లాడుతూ.. "కెమెరా ముందు నిల్చున్నప్పుడు తెలియని ఆనందం. సినీపరిశ్రమలోకి రావడం నిజంగా ఒక వరం. నటన నా బాధ్యత. దాని పట్ల నేను ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటాను. సినిమాను ఆస్వాదించడానికి భాషతో సంబంధం లేదు. ఎందుకంటే సినిమాను నడిపించేది భాష కాదు భావోద్వేగం" అని చెప్పింది.**

—అక్షరటుడే, సినిమాడెస్క్

## ఒకే కుటుంబంలో ముగ్గురి ఆత్మహత్య



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో దారుణం చోటు చేసుకుంది. అంబర్‌పేటలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఇంట్లో ఉరి వేసుకొని తనువు చాలించారు. రామరాజు తన కుటుంబంతో కలిసి అంబర్‌పేటలో ఉంటున్నాడు. మంగళవారం ఉదయం ఎంతసేపటికీ ఇంటి తలుపులు తీయకపోవడంతో స్థానికులు అనుమానంతో పిలిచారు. లోపలి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసే సరికి ముగ్గురు ఉరి వేసుకొని చనిపోయారు. మృతులను రామరాజు (55), మాధవి (50), శశాంక్ (24)గా పోలీసులు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతు భరోసా లేనట్లేనా..!



**అక్షరటుడే, తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసాపై ప్రకటన చేయలేదు. మంత్రివర్గ సమావేశంలో నిధుల విడుదలపై చర్చిస్తారని వార్తలు వచ్చినా.. దాని ఊసే ఎత్తలేదు. దీంతో ఈ సీజన్‌లో పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం జమ చేస్తుందో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు పథకం ప్రవేశ పెట్టారు. పంట పెట్టుబడి సాయం కింద మొదట ఎకరానికి రూ.4 వేలు ఇచ్చేవారు. అనంతరం ఆ మొత్తాన్ని రూ.5 వేలకు పెంచారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతు బంధు పేరును రైతు భరోసాగా మార్చింది. ఎకరాకు ప్రతి సీజన్‌లో రూ.6 వేలు అందిస్తామని ప్రకటించింది. అయితే యాసంగి సీజన్‌కు సంబంధించిన డబ్బులు డిసెంబర్‌లో వేయాలి. కానీ ఫిబ్రవరి ముగుస్తున్నా జమ చేయకపోవడం, అసలు నిధుల విడుదలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఈ సారి ఎగ్గొడుతుందని రైతులు చర్చించుకుంటున్నారు.